సంపుటి : 18
సంచిక : 189
Vol : 18
Issue : 189

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్




# పీపుల్స్ డైరీ


సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, గురువారం 24 సెప్టెంబర్ 2026
Warangal, Thursday 24 September 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00



WANTED

పీపుల్స్‌డైరీ

దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సెంటర్లు

- హనుమకొండ
- కరీంనగర్
- భూపాలపల్లి
- పెద్దపల్లి/రామగుండం
- జనగామ
- మహబూబాబాద్
- హైదరాబాద్
- నిజామాబాద్

Cell : 9493019044
9618509859



www.epaper.
peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts


వివరాలు : 2, 3 పేజీల్లో...



## వరుణుడు అతిథిగా వీడ్కోలు

- జోరు వానలో... భక్తి హోరు....
- భారీ వర్షంలోనూ ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవాలు
- డప్పు చప్పుళ్లు, డీజేల కోలాహలం....
- చిన్నాపెద్దా అందరిలో ఉప్పొంగిన భక్తి





## కేటీఆర్ మాటల గారడీ

### వందల ఎకరాల నవాబులు..

# ఏమీ లేని గరీబులు!

కొండపర్తి కిరణ్ – ప్రధాన ప్రతినిధి

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి భూముల వ్యవహారం కేంద్రబిందువుగా మారింది. ఇటీవల శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనలతో కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూములు, ఆస్తులపై రాజకీయ చర్చ మరింత వేడెక్కింది. ఆక్రమిత భూములు లేదా అక్రమంగా సంపాదించిన ఆస్తులు ఉన్నట్లు విచారణలో తేలితే వాటిని స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతామని సీఎం ప్రకటించడం ఈ వ్యవహారానికి మరింత ప్రాధాన్యత తెచ్చింది.

అయితే సీఎం ప్రకటనల తర్వాత బీఆర్ఎస్ నేతలు చేస్తున్న సమాధానాలు, గతంలో కేసీఆర్ కుటుంబం గురించి చేసిన కొన్ని రాజకీయ ప్రకటనలను ప్రత్యర్థులు తెరపైకి తీసుకురావడం కొత్త ప్రశ్నలకు దారితీస్తోంది. ముఖ్యంగా ఉద్యమ కాలంలో తమ కుటుంబ ఆర్థిక నేపథ్యం, ఆస్తుల పరిస్థితి గురించి చెప్పిన మాటలకు.. ఇప్పుడు తమకు తరతరాలుగా భూములు ఉన్నాయని చెబుతున్న వాదనలకు మధ్య ఉన్న వ్యత్యాసమే రాజకీయ విమర్శలకు ప్రధాన అంశంగా మారింది.

**నాడు ఇల్లే లేదన్నారు.. నేడు వందల ఎకరాల వారసత్వమా?**

తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ కుటుంబం సాధారణ వ్యవసాయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిందని, తెలంగాణ కోసం ఎన్నో త్యాగాలు చేశామని చెప్పుకొచ్చింది. (మిగతా 2లో...)

- వాళ్లది వందల ఎకరాల నిరుపేద కుటుంబమా...
- జనాన్ని తికమకపెడుతున్న కేటీఆర్
- మాటల మంత్రంలో తండ్రిని మించుతున్న తనయుడు...
- అటుకులు బుక్కి ఉద్యమం చేసినోళ్లకు వందల ఎకరాలు ఎలా?
- భూముల లెక్కలపై బీఆర్ఎస్‌కు ప్రశ్నలు!
- ఓసారి 'ఇల్లే లేదంటారు.. మరోసారి 'తాతల కాలం నుంచి ఆస్తి అంటారు..?
- సీఎం రేవంత్ హెచ్చరికలతో తెరపైకి రకరకాల వ్యాఖ్యలు వ్యాఖ్యలు..
- కేసీఆర్ ఆస్తులపై రాజకీయ దుమారం వాస్తవ పరిస్థితులపై జనం ఆసక్తి...

## రెండు దీపలకు ఒకే



2లో

## కుక్కలకు కోత





- ఇక వాటికీ సంతాన నియంత్రణ కేంద్రాలు
- గ్రామాల్లో వీధికుక్కల నుండి బిగ్ రిలీఫ్..
- కీలకనిర్ణయం తీసుకున్న తెలంగాణా సర్కార్!

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలంగాణా రాష్ట్రంలో ఏ గ్రామంలో చూసినా వీధి కుక్కల బెడద ఎక్కువగా కనిపిస్తోంది. పెద్దలు, పిల్లలు కుక్కల బెడదకు బయటకు వెళ్ళాలంటే భయపడుతున్నారు. వీధి కుక్కల దాడుల్లో ఆస్పత్రుల పాలవుతున్నారు. కొందరు చిన్నారులు కుక్కల దాడులలో ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇక తెలంగాణలో వీధి కుక్కల సమస్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

గ్రామాల్లోనూ కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. వీబీ జీరాంజీ పథకం కింద ఒక్కో కేంద్రానికి రూ.30 లక్షలు కేటాయించి నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇటీవల జరిగిన రాష్ట్ర జంతు సంక్షేమ మండలి సమావేశంలో ఈ ప్రణాళికను సమర్పించారు. ఈ ప్రణాళిక ప్రకారం వీధి కుక్కలతో తీవ్ర ఇబ్బంది ఉన్న చోట ముందుగా కేంద్రాలు నిర్మిస్తారు.

(మిగతా 2లో...)

## డిసెం'డర్'

- ఈ ఏడాది చివరినాటికి తారాస్థాయికి చేరనున్న ఎల్‌నినో..
- అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం...
- ప్రపంచవ్యాప్తంగా వేలాది మరణానికి ఛాన్స్

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : దేశంలో వర్షాల కాలం క్రమంగా ముగింపు దశకు చేరుకుంటోంది. దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవన వర్షాలు ఇప్పుడు తిరోగమన దిశగా అడుగులు వేస్తోన్నాయి. వాయువ్య, పశ్చిమ భారత్ నుంచి ఈ నెల 20వ తేదీ తర్వాత రుతుపవనాల ఉపసంహరణ ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. క్రమంగా పొడి వాతావరణం నెలకొంటోంది. అదే సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం వల్ల భారీ వర్షాలు పడుతున్నాయి.

పసిఫిక్ మహా సముద్రం గగనతలంపై ఎల్ నినో మరింత బలపడటానికి అనుకూల వాతావరణం నెలకొంది. దీని ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతోన్నాయి. రాబోయే కాలంలో పగటి ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగనున్నాయి. ప్రత్యేకించి.. గ్లోబల్ సౌత్ దేశాలపై దీని ప్రభావం మరింత తీవ్రంగా ఉండనుంది. తీవ్ర ఎండల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా వచ్చే ఏడాది

(మిగతా 2లో...)



- పర్యాటక శాఖ వినూత్న నిర్ణయం
- రోడ్లపై ఓపెన్‌టాప్ డబుల్‌డెక్కర్ బస్సులు
- చారిత్రక నగరమంతా తిరగొచ్చు...
- త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం

## కొత్తకొత్తగా...

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరంలో ఒకప్పుడు అలరించిన డబుల్ డెక్కర్ బస్సుల వైభవం మళ్లీ సరికొత్త హంగులతో తిరిగొస్తోంది. నగర అందాలను ఓపెన్ టాప్ బస్సుల్లో కూర్చుని వీక్షించే సరికొత్త అనుభూతిని భాగ్యనగర వాసులకు, పర్యాటకులకు అందించేందుకు తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ సిద్ధమైంది. సరికొత్తగా రెండు ఎలక్ట్రిక్ ఓపెన్–టాప్ డబుల్ డెక్కర్ బస్సులను కొనుగోలు చేయడంతో పాటు, ప్రస్తుతం హెచ్ఎమ్‌డీఏ వద్ద ఉన్న బస్సులను కూడా తమ ఆధీనంలోకి తీసుకుని నగర పర్యాటకాన్ని సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది.

త్వరలోనే నగర రోడ్లపైకి రానున్న ఈ కొత్త డబుల్ డెక్కర్ బస్సులు పర్యాటకులకు సరికొత్త రాయల్ ఫీలింగ్‌ను అందించనున్నాయి. ఈ బస్సుల అప్పర్ డెక్ ఓపెన్–టాప్‌గా ఉంటుంది. అక్కడ కూర్చుని (మిగతా 2లో...)



# నరం లేని నాలుక



(మొదటి పేజీ తరువాయి)

కుటుంబ ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ గతంలో చేసిన 'మాకు ఉండటానికి ఇల్లే లేదు', 'సొంత బాత్రూమ్ కూడా లేదు', 'పెళ్లిళ్లకు కూడా ఇబ్బందులు పడ్డాం' వంటి వ్యాఖ్యలను ఇప్పుడు కాంగ్రెస్, ఇతర రాజకీయ ప్రత్యర్థులు గుర్తుచేస్తున్నారు.

ఇదే సమయంలో భూములపై విచారణ జరిపిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో.. కేసీఆర్ కుటుంబం తమకు తాతల కాలం నుంచే వందల ఎకరాల భూములు ఉన్నాయని చెబుతున్న వాదన రాజకీయంగా చర్చనీయాంశమైంది.

నాడు పేదరికం, సాధారణ కుటుంబ నేపథ్యాన్ని రాజకీయంగా ప్రస్తావించిన కుటుంబం.. ఇప్పుడు తరతరాలుగా ఆస్తులు ఉన్నాయని చెప్పడం ఎందుకు? ఈ రెండు వాదనల్లో అసలు వాస్తవం ఏది? భూముల వివరాలు ఎప్పటి నుంచి కుటుంబానికి ఉన్నాయి? ఏ భూములు వారసత్వంగా వచ్చాయి? ఏవి తరువాత కొనుగోలు చేశారు? అనే ప్రశ్నలు సహజంగానే తెరపైకి వస్తున్నాయి.

**'అన్నీ అఫిడవిట్లలోనే ఉన్నాయి'.. బీఆర్ఎస్ వాదన**

కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. కేటీఆర్, హరీష్‌రావు తదితరులు సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణలను రాజకీయ ప్రేరేపితమైనవిగా అభివర్ణిస్తున్నారు.

తమ కుటుంబానికి సంబంధించిన భూములు, ఆస్తుల వివరాలు ఏవీ రహస్యంగా లేవని కేటీఆర్ చెబుతున్నారు. 2014, 2018, 2023 ఎన్నికల సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్లలోనే తమ ఆస్తుల వివరాలను చట్టబద్ధంగా వెల్లడించామని ఆయన వాదిస్తున్నారు. వందల ఎకరాల భూములు ఆక్రమించుకున్నారనే ప్రచారం ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమేనని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.

అంతేకాదు.. ఆరోపణలపై రాజకీయ విమర్శలు కాకుండా నిష్పాక్షిక విచారణ జరపాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. సిట్టింగ్ జడ్జితో విచారణ లేదా స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేసి, పూర్తిస్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసురుతోంది.

**విచారణ జరిగితేనే అసలు లెక్క తేలుతుందా?**

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ఎన్నికల అఫిడవిట్లలో ఆస్తులు చూపించడం ఒక అంశమైతే.. ఆ ఆస్తులు ఎలా వచ్చాయి? వాటి కొనుగోళ్లకు సంబంధించిన పత్రాలు ఏమిటి? భూముల స్వభావం ఏమిటి? అవి పట్టా భూములా, ప్రభుత్వ భూములా, అసైన్డ్ భూములా? కొనుగోలు ప్రక్రియలో ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించారా? అనే అంశాలు మరో కీలకమైన ప్రశ్నలు.

అఫిడవిట్‌లో ఆస్తిని ప్రకటించడం ద్వారా ఆ ఆస్తి స్వయంచాలకంగా చట్టబద్ధమవుతుందా? లేక ఆ ఆస్తికి సంబంధించిన మూల పత్రాలు, భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, రెవెన్యూ రికార్డులు కూడా పరిశీలించాల్సి ఉంటుందా? అనే చర్చ కూడా మొదలైంది.

అందుకే రాజకీయ ఆరోపణలతో కాకుండా.. భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, రెవెన్యూ రికార్డులు, ఎన్నికల అఫిడవిట్లు వంటి అధికారిక ఆధారాల ఆధారంగా పూర్తి స్థాయి విచారణ జరిగితేనే అసలు వాస్తవం బయటపడే అవకాశం ఉంది.

కేసీఆర్ కుటుంబ భూములపై జరుగుతున్న రాజకీయ చర్చలో అత్యంత ఆసక్తికరమైన అంశం ఆస్తుల చట్టబద్ధత కంటే.. గతంలో చెప్పిన మాటలు, ఇప్పుడు చెబుతున్న మాటల మధ్య కనిపిస్తున్న వ్యత్యాసం.

నాడు 'సాధారణ కుటుంబం.. ఆస్తులు లేవు.. ఇబ్బందులతో జీవితం' అనే రాజకీయ నేపథ్యం.. నేడు 'తాతల కాలం నుంచే వందల ఎకరాల భూములు.. వారసత్వ ఆస్తులు' అనే వాదనకు ఎలా మారింది? ఈ రెండు సందర్భాల్లో ఏది పూర్తి వాస్తవానికి దగ్గరగా ఉంది? లేక రెండింటికీ భిన్నమైన సందర్భాలు ఉన్నాయా? అన్నది ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఇంత బాధ్యతారాహిత్యమా...?

- ఆస్పత్రి ఆవరణలోనే డీజే సౌండ్...
- పక్కనే రోగులు... ఆస్పత్రి నిర్వాహకుల శబ్ద కాలుష్యం
- రోగులకు ఏమైనా అయితే బాధ్యత ఎవరిది?
- వరంగల్‌లోని ప్రముఖ ఆస్పత్రి నిర్వాకం...





**పీపుల్స్‌డైరీ-వరంగల్:** వినాయక నిమజ్జనోత్సవాల సందర్భంగా ఆసుపత్రి ఎమర్జెన్సీ విభాగానికి సమీపంలో భారీ సౌండ్ సిస్టమ్‌తో డీజే మోత పెట్టడం చర్చనీయాంశంగా మారింది. అత్యవసర చికిత్స కోసం రోగులు వచ్చే ప్రాంతానికి అతి సమీపంలోనే పెద్దఎత్తున శబ్దాలు చేయడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిమజ్జన శోభాయాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ సౌండ్ బాక్సుల నుంచి వెలువడిన డీజే శబ్దాలు ఆసుపత్రి పరిసరాలను హోరెత్తించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఎమర్జెన్సీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులు, వైద్య సిబ్బందికి ఇలాంటి అధిక శబ్దాలు అసౌకర్యానికి గురిచేసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

**రోగుల పరిస్థితిపై కనీస ఆలోచనేదీ..?**

ఆసుపత్రి అంటేనే ప్రశాంతమైన వాతావరణం ఉండాల్సిన ప్రదేశం. ముఖ్యంగా ఎమర్జెన్సీ విభాగం వద్ద అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు ప్రశాంత వాతావరణం అవసరం. అలాంటి ప్రాంతంలోనే భారీ డీజే సౌండ్‌తో నిమజ్జన వేడుకలు నిర్వహించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేడుకల ఉత్సాహం ఉండొచ్చు.. కానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల పరిస్థితిని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన బాధ్యత ఉందని పలువురు సూచిస్తున్నారు.

నిమజ్జనోత్సవాలకు అనుమతులు ఉన్నప్పటికీ ఆసుపత్రులు, పాఠశాలలు, ఇతర సున్నిత ప్రాంతాల సమీపంలో శబ్ద కాలుష్య నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. పండుగల సందర్భంగా భక్తి, ఉత్సాహంతో పాటు సామాజిక బాధ్యతను కూడా పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# రెండు డీకేలకు ఓకే...

- తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్
- అక్టోబర్ నెల జీతంలో ఒకటి... ఉగాదికి మరొకటి...!
- 3.64 శాతం, 2.74 శాతానికి అంగీకారం
- త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ కరువు భత్యం (డీఏల) విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏ వాయిదాల్లో రెండు డీఏలను విడుదల చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. సెక్రటేరియట్‌లో ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు జరిపిన చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరినట్లు సమాచారం. రెండు డీఏల్లో ఒకటి 3.64 శాతం, మరొకటి 2.74 శాతం చొప్పున ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించినట్లు తెలుస్తోంది. అయితే తుది అధికారిక ఉత్తర్వులకు కేబినెట్ ఆమోదం కావాల్సి ఉంది.

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలపై ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వంతో చర్చలు జరిపారు.. ఇందులో భాగంగా సచివాలయంలో సీఎస్‌తో జరిగిన సమావేశంలో పెండింగ్‌లో ఉన్న డీఏలతో పాటు రెండో పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు, పెండింగ్ బిల్లుల చెల్లింపు వంటి అంశాలను ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రస్తావించారు. ఇటీవలి కాలంలో ఉద్యోగ సంఘాలు పెండింగ్ డీఏలు, పీఆర్సీ, బిల్లుల పరిష్కారంపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి.

మొత్తం 5 పెండింగ్ డీఏలను విడుదల చేయాలని ఉద్యోగ సంఘాల నేతలు కోరగా.. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం 2 డీఏల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇందులో మొదటి డీఏ 3.64 శాతం, రెండో డీఏ 2.74 శాతంగా ఉంటాయి. దీంతో రెండు డీఏల ద్వారా ఉద్యోగుల వేతనాల్లో కరువు భత్యం భాగం పెరగనుంది. ఈ చర్చల్లో కుదిరిన అవగాహన ప్రకారం.. ఒక డీఏను రాబోయే అక్టోబర్ నెల జీతంతో కలిపి చెల్లించే ప్రతిపాదన ఉన్నట్లు సమాచారం. మరో డీఏను ఉగాది సందర్భంగా విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు ఉద్యోగ సంఘాల వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ చెల్లింపుల షెడ్యూల్‌కు సంబంధించిన తుది నిర్ణయం అధికారిక ఉత్తర్వులు వెలువడిన తర్వాతే స్పష్టం అవుతుంది.

# వరుణుడు అతిథిగా వీడ్కోలు....

- జోరు వానలో... భక్తి హోరు....
- భారీ వర్షంలోనూ ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవాలు
- డప్పు చప్పుళ్లు, డీజేల కోలాహలం....
- చిన్నాపెద్దా అందరిలో ఉప్పొంగిన భక్తి



పీపుల్స్‌డైరీ-వరంగల్ : భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బుధవారం రాత్రి గణేష్ నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. వరుణుడు ధారగా కురుస్తున్నా గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. 'జై బోలో గణేష్ మహారాజ్‌కి జై' అంటూ నినాదాలు చేస్తూ గణనాథుడి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. వర్షంలో తడుస్తూనే భక్తులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. డప్పు చప్పుళ్లు, భక్తిగీతాలు, గణేష్ నామస్మరణలతో నిమజ్జన ఊరేగింపులు హోరెత్తాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు భక్తులు ఉత్సాహంగా పాల్గొని గణేషుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

పలు ప్రాంతాల్లో నిమజ్జన శోభాయాత్రలు రాత్రి వరకు కొనసాగాయి. భారీ వర్షం కారణంగా ఇబ్బందులు ఎదురైనా భక్తుల ఉత్సాహం మాత్రం ఏమాత్రం తగ్గలేదు. గణనాథుడిని నిమజ్జనం చేస్తూ భక్తులు వచ్చే ఏడాది మళ్లీ రావాలంటూ ప్రార్థించారు. దీంతో బుధవారం రాత్రి ఆయా ప్రాంతాల్లో భక్తి, ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.







# డిసెం'డర్'

(మొదటి పేజీ తరువాయి)

ఫిబ్రవరి నాటికి 4,51,000 మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.

ఎల్ నినో పరిణామాలపై క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ తన తాజా నివేదికను వెల్లడించింది. ఎల్ నినో ప్రభావంపై 1996 నుంచి 2025 మధ్య కాలాన్ని ప్రాతిపదికగా తీసుకుంది. గ్లోబల్ సౌత్ దేశాల వాతావరణ స్థితిగతులు, ఉష్ణోగ్రత రికార్డులను కూడా తిరగేసింది. వాటన్నింటినీ క్రోడీకరించి.. ఈ నివేదికను రూపొందించింది. వచ్చే ఆరు నెలల కాలంలో పెరిగే ఉష్ణోగ్రతల వల్ల సంభవించే మరణాలు అన్ని గ్లోబల్ సౌత్ దేశాల్లోనూ నమోదు కావచ్చని పేర్కొంది.

ఆఫ్రికాలోని సాహెల్ ప్రాంతంలో అత్యధికంగా 66,800 మరణాలు సంభవించే అవకాశం ఉందని అంచనా వేసింది. ఒక్క నైజీరియాలోనే 31,400 మంది మరణించడానికి అవకాశం ఉంది. అలాగే సూడాన్- 17,500, నైగర్- 10,000, చాద్- 8,000 మంది ఎండల తీవ్రత తట్టుకోలేక ప్రాణాలు కోల్పోవచ్చు. ఆగ్నేయాసియా దేశాలైన ఫిలిప్పీన్స్, వియత్నాం, థాయిలాండ్, కాంబోడియాలలో కలిపి 19,400 మరణాలు సంభవించవచ్చని క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ అభిప్రాయపడింది.

భారత కూడా ఎల్ నినో, దానివల్ల సంభవించే మరణాల ముప్పును ఎదుర్కొంటోంది. ఎల్ నినో తీవ్రత కారణంగా దాదాపు 15,800 మరణాలు నమోదయ్యే అవకాశం ఉందని ఈ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఇండోనేషియా- 19,300, బ్రెజిల్- 13,300 మంది ఈ ప్రమాదకర వాతావరణ మార్పుల పరిధిలో ఉన్నారు. రానున్న కాలంలో ఉష్ణోగ్రతలు మరింత అసాధారణంగా పెరిగే అవకాశం ఉండటంతో ఈ దేశాల్లో నివారణ చర్యలతో పాటు తగిన రక్షణ ప్రణాళికలు అవసరమని సూచించింది.

ప్రపంచ వాతావరణ సంస్థ అంచనా ప్రకారం ఈ ఎల్ నినో ప్రభావం ఇంకా గరిష్ఠ స్థాయికి చేరుకోలేదు. నవంబర్-డిసెంబర్ నాటికి ఇది మరింత తీవ్రరూపం దాల్చనుంది. 2027 ఫిబ్రవరి వరకు దీని ప్రభావం దాదాపు 100 శాతం కొనసాగుతుందని వాతావరణ నిపుణులు భావిస్తున్నారు.

# కుక్కలకు 'కోత'...



(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్లాన్ లో భాగంగా మండలానికి ఒక కేంద్రం చొప్పున ఏర్పాటు చేసి, తర్వాత గ్రామాలకు విస్తరిస్తారు. ప్రస్తుతం హైదరాబాద్, ఇతర నగరాల్లోనే ఇలాంటి కేంద్రాలు ఉన్నాయి. సుప్రీంకోర్టు వీధి కుక్కలను నియంత్రించాలని ఆదేశించిన నేపథ్యంలో, గ్రామాల్లో కూడా దాడులు పెరుగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నారు. సమస్య ఎక్కువగా ఉన్న గ్రామాలను గుర్తించి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా నిర్మాణాలు చేపడతారు. తర్వాత ఆ కేంద్రాలను పశు సంవర్ధక శాఖకు అప్పగిస్తారు. గ్రామ పంచాయతీ సిబ్బంది కుక్కలను పట్టుకొని తీసుకువస్తే, వైద్యులు స్టెరిలైజేషన్ శస్త్రచికిత్సలు చేసి, రేబిస్ నివారణ టీకాలు వేసి వదిలేస్తారు.స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తే నగరాల్లో శస్త్రచికిత్సకు రూ.1,500, గ్రామాల్లో రూ.1,650 చొప్పున చెల్లించేందుకు శాఖ అనుమతించింది.

ఈ చర్యల ద్వారా వీధి కుక్కల సంఖ్యను నియంత్రించి, ప్రజలకు భయం లేకుండా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది అమలైతే, గ్రామాలలో కుక్కల కుటుంబ నియంత్రణా కేంద్రాలు ఏర్పాటు చేస్తే పెద్దలు, పిల్లలు నిరభ్యంతరంగా బయటకు వెళ్ళొచ్చు, ఏ ఒక్కరి ప్రాణం కుక్కల కారణంగా పోకుండా ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో గ్రామాల ప్రజలలో సంతోషం వ్యక్తం అవుతుంది.

# కొత్తకొత్తగా...

(మొదటి పేజీ తరువాయి)



పర్యాటకులు నగరపు చారిత్రక భవనాలు, అందమైన రోడ్లను నేరుగా చూస్తూ ఎంజాయ్ చేయవచ్చు. అదే సమయంలో కింలోయర్ డెక్ పూర్తిగా ఎయిర్ కండిషన్డ్ క్యాబిన్‌గా అందుబాటులో ఉంటుంది. పర్యాటకుల సౌకర్యార్థం గైడ్ మైక్రోఫోన్ సిస్టమ్, ఎంటర్ టైన్ కోసం స్పీకర్లు, మొబైల్ యూఎస్‌బీ ఛార్జింగ్ పాయింట్లు, ఆకట్టుకునే ఎల్‌ఈడీ లైటింగ్ వంటి అత్యాధునిక హంగులను ఈ బస్సుల్లో ఏర్పాటు చేస్తున్నారు.

ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ వద్ద ఇప్పటికే రూ. 12 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన 6 ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు ఉన్నాయి. వీటన్నింటినీ పర్యాటక శాఖ పరిధిలోకి మార్చాలని ఇప్పటికే లేఖ రాయగా, అధికారుల తనిఖీ కూడా పూర్తయింది. త్వరలోనే అధికారికంగా ఈ బస్సులు పర్యాటక శాఖ చేతికి రానున్నాయి. ప్రస్తుతం నెక్లెస్ రోడ్, వేవ్ రాక్, హైటెక్ సిటీ, ట్యాంక్ బండ్, గోల్కొండ కోట వంటి ప్రధాన పర్యాటక ప్రాంతాల మార్గాల్లో ఈ బస్సులను నడపడానికి రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. ఒకసారి ఛార్జింగ్ చేస్తే 150 కిలోమీటర్లు తిరిగే ఈ ఎలక్ట్రిక్ బస్సులు నగరంలో పొల్యూషన్ లేని హాయి ప్రయాణాన్ని అందించనున్నాయి.

# జై జై గణేశా... బై బై గణేశా



గిర్మాజీపేటలోని గోవిందరాజుల గుట్ట వద్ద...

కాశిబుగ్గ, సెప్టెంబర్ 23, ( పీపుల్స్ డైరీ,) : సోమవారం ప్రారంభమైన గణేష్ నవరాత్రి ఉత్సవాలు బుధవారం నిమజ్జనంతో ముగిశాయి. తొమ్మిది రోజులపాటు అంగరంగ వైభవంగా ధూప, దీప నైవేద్యాల తో పాటు హారతులు, హోమాలు, కుంకుమార్చనలు, అన్న ప్రసాద వితరణలు, భజనలు, మంగళ హారతులతో గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం నిమజ్జనం సందర్భంగా గణనాథులను అలంకరించి జై బోలో గణేష్ మహారాజ్ కి జై, జై జై గణేశా, బై బై గణేశా అంటూ డప్పు చప్పుళ్లతో, కోలాటాలతో నృత్యాలు చేస్తూ గణేశుడికి వీడుకోలు పలికారు.









నిమజ్జనానికి వెళుతున్న గణేశుడికి హారతులు పడుతున్న మహిళలు



వర్షంలో నిమజ్జనానికి వెళుతున్న గణనాథుడు



వరంగల్ దేశాయిపేట 80 ఫీట్ రోడ్ లో వర్తక సంఘం ఆధ్వర్యంలో...



26వ డివిజన్ గిర్మాజీపేట వివేకానంద కాలేజ్ పక్కన...



కాశిబుగ్గ దేవాలయం పక్కన సాయి వీధిలో...



కాశీబుగ్గలో ఓ సిటీ అపార్ట్ మెంట్ లో...



ఇల్లంద గ్రామంలో...



జెపిఎన్ రోడ్ లోని డాల్ఫిన్ గల్లీలో శ్రీ లక్ష్మీ వినాయక కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో...



వినాయక మండపం వద్ద పేరిని శిష్య బృందంతో గజ్జెల రంజిత్ కుమార్



కాశిబుగ్గ ఓ సిటీ రోడ్ లోని క్రిటి ఇన్ క్లేవ్ అపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో...



కాశీబుగ్గలోని ఇందిరా గాంధీ విగ్రహం ఎదురు వీధిలో...

## ఫ్రోబెల్ మోడల్ హైస్కూల్‌లో ఘనంగా గణేష్ నిమజ్జన వేడుకలు

గణపురం, సెప్టెంబర్ 23 (పీపుల్స్‌డైరీ) : మండల కేంద్రంలోని ఫ్రోబెల్ మోడల్ హైస్కూల్‌లో తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాల అనంతరం బుధవారం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా మట్టితో తయారు చేసిన పర్యావరణహిత గణపతి విగ్రహానికి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, పాఠశాలలో ఇటువంటి పండుగలను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలు మరియు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కలుగుతుందని తెలిపారు. మట్టితో గణపతి విగ్రహాన్ని తయారు చేయడం ద్వారా పర్యావరణహితమైన పండుగల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్. కృష్ణ, కరస్పాండెంట్ పి. శివ శంకర్, డైరెక్టర్లు ఎల్. యాదగిరి, ఎస్. జగన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## శ్రీ నారాయణ స్కూల్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం

### భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

గణపురం, సెప్టెంబర్ 23 (పీపుల్స్‌డైరీ) : గణనాథుని ఆశీస్సులతో నారాయణ హైస్కూల్‌లో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శ్రీ నారాయణ హై స్కూల్‌లో నిర్వహించిన వినాయక చవితి వేడుకలకు ముగింపుగా వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలతో సందడి చేశారు. సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం గణనాథుని విగ్రహాన్ని ఊరేగింపుగా నిమజ్జన స్థలానికి తీసుకెళ్లారు. భక్తిగీతాలు, నృత్యాలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నాగనబోయిన రవి, కరస్పాండెంట్ పోతుగంటి శశిధర చారి మాట్లాడుతూ వినాయక చవితి పండుగ విద్యార్థుల్లో ఐక్యత, భక్తి, పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహనను పెంపొందిస్తుందని తెలిపారు. పర్యావరణహితమైన విధానాలను పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పోతుగంటి సప్నా చారి మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా నేతాజీ యూత్ అసోసియేషన్ వినాయక నిమజ్జనం



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** ముల్కనూర్ నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమానికి భక్తులు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేకంగా అలంకరించిన వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా నిమజ్జన స్థలానికి తరలించారు. యువత డప్పులు, బ్యాండ్ వాయిద్యాల నడుమ ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. భక్తులు "గణపతి బప్పా మోరియా" అంటూ నినాదాలు చేస్తూ స్వామివారికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాజు మాట్లాడుతూ.. నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా భక్తుల సహకారంతో ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో నేతాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు రాజు , శ్రీనాథ్, నిఖిల్, శ్రీనివాస్, సంపత్, రాజన్న, సురేష్, అరుణ్, సురేష్, కనకయ్య ,రాజేష్, యువత, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ముత్తారంలో ఘనంగా పోషణ మాసం వేడుకలు



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ ) :** భీమదేవరపల్లి ప్రాజెక్టు పరిధిలోని కొత్తకొండ సెక్టార్ ముత్తారం-1 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 9వ పోషణ మాసం-- "మన అంగన్‌వాడీ.. మన బాధ్యత" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించి, పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీలో కొత్తగా చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, వారి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదల, గర్భిణీలు బాలింతలకు పౌష్టికాహారం అందించడం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవడంపై కార్యక్రమంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వరూప, సర్పంచ్ ఊరడి భారతి, ఉప సర్పంచ్ మాట్ల హరికుమార్, వార్డు సభ్యుడు కొర్ర తిరుపతి, అంగన్‌వాడీ టీచర్లు రేణికుంట్ల సునీత, కవిత, గర్భిణీలు, చిన్నారులు, తల్లులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ఘనంగా గణేష్ నిమజ్జనం



**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం దేవస్థానం కోనేరు వద్ద గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామ ప్రజలు,ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమం ప్రశాంతంగా,భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు దేవస్థాన కార్యనిర్వహణ అధికారి పి.కిషన్ రావు తెలిపారు.

## గణపతి సేవకుడు హనుమంతరావుకు ఘన సన్మానం

**వరంగల్ సెప్టెంబర్ 23 (పీపుల్స్‌డైరీ) :** వరంగల్ నగరంలోని రంగసాయిపేటలో రుద్రమనగర్ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గత 25 సంవత్సరాలుగా గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పసుపులేటి హనుమంతరావు కాలనీవాసులను మమేకం చేసి ఎంతో భక్తిశ్రద్ధలతో గణపతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరము సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భగవద్గీత పారాయణం మొదలగు అభివృద్ధి కార్యక్రమాలు నిర్విరామముగా చేపడుతున్న అధ్యక్షులను ఈ 25వ సంవత్సరంలో గణపతి నవరాత్రులలో రుద్రమాంబ నగర్ ఉత్సవ కమిటీ తరపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ఉండి నన్ను భక్తి కార్యక్రమాలు చేసేందుకు కాలనీవాసులు సహకరించినందుకు నాకు చాలా ఆనందదాయకంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేసేందుకు కాలనీ వాసుల సహకారాలు ఇలాగే ఉంటే మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తానని హనుమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్రమ నగర్ గణపతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు పసుపులేటి హనుమంతరావు, కర్ణ వేణుగోపాల్, కొంగరి లక్ష్మీనారాయణ, బత్తుల సుదర్శన్,కొంతం వెంకన్న, బోడ కృష్ణ,మట్టపల్లి దేవేందర్,ఆకుల మహేందర్, రాచమల్ల రాజేష్, సతీష్,పసుపులేటి పూర్ణచందర్, గుండు దిలీప్ కుమార్, పోగుల సుతేజ్, సిద్ధార్థ, కుశాల్,రాజ్ కుమార్,బోగోజు రాజేష్ తదితరులు పాల్గొన్నారు





## గణేష్ మండపాల్లో మంత్రి పొన్నం ప్రత్యేక పూజలు





**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ)** సెప్టెంబర్ 23 గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని పలు గణేష్ మండపాలను రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. హుస్నాబాద్ ఆర్టీసీ బస్ డిపో కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని సందర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం హనుమాన్ నగర్‌లో బొలిశెట్టి శివయ్య నివాసం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపానికి వెళ్లి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ గణేశుడిని ప్రార్థించారు.గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఘాట్ సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన మంత్రి



సైదాపూర్ సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ): బతుకమ్మ బండ వద్ద వి.బి.జి. రాంజీ నిధులు రూ. 20 లక్షలతో మంజూరైన నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి సైదాపూర్ గ్రామ సర్పంచ్ మునిగంటి స్వప్న – సంతోష్ దంపతులు కొబ్బరికాయ కొట్టి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మరియు సర్పంచ్ మునిగంటి స్వప్న – సంతోష్‌లకు గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బతుకమ్మ బండ ప్రాంతంలో రోడ్డు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈ నిధులు మంజూరు చేయించినట్లు వారు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ వార్డ్ సభ్యులు, అధికారులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

## మృతుల కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్





సైదాపూర్ సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) : సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన అనగోని రవీందర్, మొలుగూరి వసంత అనారోగ్య కారణాలతో మృతి చెందడంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ బుధవారం రోజున ఆయన ఆమె కుటుంబాన్ని పరా మర్శించారు. రవీందర్ వసంతల నివాసానికి వెళ్లిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు. చాడ కొండల్ రెడ్డి సీనియర్ నాయకులు గుండారం శ్రీనివాస్ స్థానిక సర్పంచ్ మునిగంటి స్వప్న సంతోష్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మిట్టపల్లి కిష్టయ్య మాజీ ఎంపీపీ కామిని వీరేశం సింగిల్ విండో మాజీ చైర్మన్ రాజిరెడ్డి నాయకులు యూత్ అధ్యక్షులు సాయికుమార్ రాకేష్ విద్వాన్ రెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ సింగిల్విండో డైరెక్టర్లు బొమ్మగాని రాజు ఉపసర్పంచ్ నవీన్ గొల్లపల్లి యాదగిరి కిసాన్ సెల్ నాయకులు కార్యకర్తలు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## సిద్ధమల్ల ఐలమ్మ కుటుంబానికి మంత్రి పొన్నం పరామర్శ



భీమదేవరపల్లి: సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో ఇటీవల మృతి చెందిన సిద్ధమల్ల ఐలమ్మ కుటుంబాన్ని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కొత్తకొండలోని ఐలమ్మ నివాసానికి చేరుకున్న మంత్రి, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, ఐలమ్మ మృతికి గల కారణాలను మరియు వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం మరియు వ్యక్తిగత పరంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుండాల, ఆళ్లపల్లి పీహెచ్‌సీల్లో వైద్యున్ని నియమించండి

### *డీఎంహెచ్‌ఓను ఆదేశించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు*



ఆళ్ళపల్లి గుండాల, సెప్టెంబర్ 23(పీపుల్స్ డైరీ) : పినపాక నియోజకవర్గం మణుగూరు క్యాంపు కార్యాలయంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్కే ఖదీర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆళ్ళపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ ఈ సందర్భంగా వారు గుండాల మరియు ఆళ్ళపల్లి మండల కేంద్రం లో గల ప్రాథమిక వైద్యశాల నందు వీదీదూ డాక్టర్స్ అందుబాటులో లేకపోవడం వలన మండల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సీజనల్ వ్యాధుల బారిన పడి అటు ప్రభుత్వ హాస్పిటల్ లో వైద్యం అందక ఇటు ప్రైవేట్ హాస్పిటల్స్ లో చూపించుకునే స్తోమత లేక అనేక ఆర్థిక ఇబంధులకు గురి అవుతున్నారని, మారుమూల ప్రాంతమైన గుండాల మరియు ఆళ్లపల్లి మండలాల్లో ఇద్దరు ఎంబిబిఎస్ డాక్టర్స్ ని కేటాయించి 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుని కోరడం జరిగింది. సానుకూలంగా స్పందించిన శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు వెంటనే డి ఎం హెచ్ ఓ తో చరవాణి ద్వారా మాట్లాడి గుండాల మరియు ఆళ్లపల్లి మండలాల్లో ప్రజలు పట్టనాలకు సుదూర ప్రాంతం లో ఉంటారని పూర్తిగా గిరిజన ప్రాంతం అని అలాంటి ప్రాంతంలో అత్యవసర పరిస్థితులు, ప్రాణాపాయ పరిస్థితులు వాటిల్లక ముందే ఆయా మండలాల్లో గల ప్రాథమిక వైద్యశాల లో వెంటనే డాక్టర్స్ ని కేటాయించి వారిని డిప్యూటేషన్‌లో గాని, రొటేషన్ పద్ధతిలో గాని ఉపయోగించ కుండా పర్మనెంట్ గా 24 గంటలు అక్కడే అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేయాలని మరొక్కసారి ఇలాంటి పరిస్థితులు పునరావృతం అవకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలివడం జరిగింది.

ఈ కార్యక్రమం లో గుండాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఊకె బుచ్చయ్య, ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్, ఆయా మండలాల నాయకులు వాంకుడోత్ బీకోజీ, ౹ాఖ కాసీం, ఊళ్ళోజు భరత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్మీ ప్రసన్న జ్యువెల్లరీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం

ఆళ్ళపల్లి సెప్టెంబర్ 23(పీపుల్స్ డైరీ) : మండల పరిధిలోని మర్కోడు గ్రామపంచాయతీ జిన్నెలగూడెం గ్రామంలో బుధవారం నాడు లక్ష్మీ ప్రసన్న దయాకర్ చారి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ విజయవంతంగా కొనసాగింది.

## నిమజ్జనం వేళ విగ్రహ దాత, సర్పంచ్‌కు ఘన సన్మానం

గణపురం, సెప్టెంబర్ 23 (పీపుల్స్‌డైరీ) : గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన వినాయక ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిమజ్జన కార్యక్రమానికి విగ్రహాన్ని తరలించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ధర్మవాహిని ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వినాయక విగ్రహ దాత బోజ వాసుదేవ రెడ్డి, గ్రామ సర్పంచ్ వీరమల్ల సంపత్ రెడ్డిలను ధర్మవాహిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధర్మవాహిని నిర్వాహకులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొని వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



# ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా..?

## వినయ్ భాస్కర్‌పై పోలీసుల తీరు అప్రజాస్వామికం - ఎంజీఎం ఘటనపై మాజీ ఎమ్మెల్యే నన్నపునేని ధ్వజం

**మట్టెవాడ, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** వరంగల్‌లో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌పై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎంజీఎం ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిశీలించి, వాటిపై నిలదీసిన వినయ్ భాస్కర్‌పై పోలీసులు వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమని అన్నారు.

### ఎంజీఎంలో కుంటుపడ్డ వైద్య సేవలు...

ఎంజీఎం ఆసుపత్రిలో వైద్య వ్యవస్థ కుప్పకూలుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నరేందర్ విమర్శించారు. ఓపీ చీటీలు అందుబాటులో లేకపోవడంతో ఏ4 పేపర్లపై వైద్యులు ప్రిస్క్రిప్షన్లు రాస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. ఎక్స్‌రే యంత్రాలు పని చేయక పోవడం, ల్యాబ్‌లు మూతపడటం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.



### ప్రైవేట్ ల్యాబ్‌లకు రోగుల తరలింపు?

కమీషన్ల కోసం రోగులను ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపుతున్నారనే ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని నరేందర్ అన్నారు. కొందరు ప్రభుత్వ వైద్యులు విధులకు గైర్హాజరై ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేస్తున్నారనే ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 600 మంది సిబ్బంది ఉండాల్సిన చోట సగం మందితోనే సేవలు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు.

### సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తెరవాలి

వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని తక్షణమే ప్రారంభించి, ఎంజీఎంలో వైద్య సేవలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని నరేందర్ డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపైనా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసి పోలీసుల అండతో పాలన సాగించడం సరికాదని నరేందర్ అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు తుమికి రమేష్ బాబు, కుందారపు రాజేందర్, కొంతం మోహన్, టి.రమేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**నర్సంపేట, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట నియోజకవర్గంలోని నర్సంపేట పట్టణం , నర్సంపేట మండలం, దుగ్గొండి, నల్లబెల్లి , ఖానాపూర్ మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మొత్తం 146 మంది లబ్ధిదారులకు 1 కోటి 46 లక్షల రూపాయల విలువైన చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఉమారాణి, మునిసిపల్ చైర్పర్సన్ పెండెం లక్ష్మి రామనంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్,పీఏసీఎస్ చైర్మెన్లు బొబ్బల రమణా రెడ్డి ,తోకల శ్రీనివాస్ రెడ్డి,చెన్నూరు కిరణ్ రెడ్డి, కంకల ప్రసాద్, రఘుపతి రావు, వల్లే శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హరిబాబు, మునిసిపల్ వైస్ చైర్మన్ నరేందర్, కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొన్నారు.



## అంబేద్కర్‌ను అవమానిస్తే దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదు!

### చుంచు రాజేందర్ డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

**ఆత్మకూరు, సెప్టెంబర్ 23(పీపుల్స్ డైరీ) :** భారతరత్న, బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానిస్తూ అతను రచించిన భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్రలకు దారితీసే విధంగా కొంతమంది మత తత్వ శక్తులు పనికట్టుకొని తిరుగుతున్నాయని వాటిని తిప్పికొట్టి భారత రాజ్యాంగాన్ని మనువాధుల చెర నుండి రక్షించుకోవాలని, అంబేద్కర్ ను అవమానిస్తే దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్, ప్రజా సంఘాల జెఎసి జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ పిలుపునిచ్చారు.బుధవారం నాడు ఆత్మకూరు మండలం నాగయ్యపల్లి గ్రామంలో డిబిఎఫ్ గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్, ప్రజా సంఘాల జెఎసి జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని ప్రపంచ దేశాలు కొనియాడుతుంటే హమారా ప్రసాద్ లాంటి మనువాధులను అంబేద్కర్‌ను కించపరిచే విధంగా మాట్లాడించడం సిగ్గు చేటాన్నారు.అంబేద్కర్ ఎవరు అవమానించిన భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన దేశ ప్రజల చేతిలో కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి మాదాసి సుదర్శన్, ఉపాధ్యక్షులు చుంచు నరేష్, గ్రామ అధ్యక్షులు మాదాసి నవీన్, రాజు, సుశీల, రాధ, లక్ష్మి, కొమురయ్య,రాజయ్య, శ్రీకాంత్, కుమారస్వామి, స్వామి, చేరాలు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న శ్రీలక్ష్మీరామానంద్



**నర్సంపేట, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :**గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నర్సంపేట మున్సిపల్ పరిధిలోని 25వ వార్డు సరోజినీదేవి రోడ్డు ముదిరాజ్ సంఘం ప్రాంతంలో 25వ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని, బుధవారం నాడు వార్డు యూత్ క్లబ్ సభ్యుల ఆహ్వానం మేరకు వినాయక మండపం వద్దకు విచ్చేసి విగ్నేశ్వరుడిని నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్, తెలంగాణ రాష్ట్ర పీసీసీ సభ్యులు పెండెం శ్రీలక్ష్మీరామానంద్ దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా 25వ వార్డు యూత్ క్లబ్ సభ్యులు మున్సిపల్ చైర్ పర్సన్, టీపీసీసీ సభ్యులు పెండెం శ్రీలక్ష్మీరామానంద్ దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, కాట రఘు, కిసరి రాజీవ్, కాట అఖిల్, గుడికందుల సదానందం, బాలాజీ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాముంరాజ్, నాంపల్లి ప్రవీణ్, కాట రాహుల్, మొట్ల జోగిరెడ్డి, ఎదరబోయిన రాజు, కొలువుల స్వామి, కరెంటు సారన్న, కొలువుల గోపి, బండి మధు, సబ్బాని శ్రీనివాస్, కొలువుల అనిల్, పుట్టపాక రాజేష్, సబ్బాని శివ, తాటికొండ శివప్రసాద్, కొలువుల అరుణ్, అందే రవికుమార్,కొలువుల పవన్,అంతే రంజిత్, కొలువుల శివ,రాధారపు రోషన్,రాధారపు తరుణ్, తోపాటు వార్డు ప్రజలు, భక్తులు,తదితరులు పాల్గొన్నారు..

## రైతు గుర్తింపు కార్డు కోసం ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

**చిట్యాల,సెప్టెంబర్23 (పీపుల్స్ డైరీ) :** చిట్యాల నవాబుపేట తిరుమలాపూర్ మరియు కైలాపూర్ రెవెన్యూ గ్రామాల రైతులు ఇది వరకు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోకుంటే అలాగే ఫస్ట్ డిసెంబర్ 2025 నుండి నుండి 13 ఆగస్టు 2026 తేదీలోపు పట్టాపాస్ పుస్తకం పొందిన రైతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు గుర్తింపు కార్డు కోసం ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు అవకాశం కల్పించడం జరిగిందని మండల వ్యవసా య విస్తరణ అధికారి చిర్ర సన్నీ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పత్తి



మొక్కజొన్నకంది వంటి పంటల కనీస మద్దతు ధరకు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఎరువుల కొనుగోలుకు బ్యాంకు ల ద్వారా రుణాలు పొందడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలకు మరియు వ్యవసాయ సంబంధిత సబ్సిడీలకు ఫార్మర్ ఐడి తప్పనిసరి

**చిర్ర సన్నీ గౌడ్**

అన్నారు. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియకు రైతు యొక్క ఆధార్ కార్డు ఆధార్ కార్డుకు లింక్ చేయబడిన మొబైల్ నెంబర్ తీసుకొని చిట్యాల రైతు వేదికలో లేదా దగ్గరలో ఉన్న మీసేవ కేంద్రాల వద్ద ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని ఆమె సూచించారు. పట్టా పాస్ పుస్తకం కలిగి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని గతంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకొని ఫార్మర్ ఐడి పొందిన వారు మరల ఫార్మర్ రిజిస్ట్రీ చేపించనవసరం లేదని ఆమె తెలిపారు.

## హోంగార్డ్ కుటుంబానికి రూ.20 వేల చెక్కు అందజేత

**చిట్యాల, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ గోలి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ తరఫున వెల్ఫేర్ ఎక్స్‌గ్రేషియా కింద మంజూరైన రూ.20 వేల చెక్కును జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డ్ గోలి శ్రీనివాస్ అకాల మరణం పోలీస్ శాఖకు తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ వెల్ఫేర్ పథకాలు



సిబ్బంది కుటుంబాలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పించడంలో కీలకంగా నిలుస్తాయని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ సంతోష్ కుమార్ పాటు హోంగార్డ్ గోలి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అమరవేణి సిద్దార్థ బహుజన్ గౌడ్‌కు పలువురు నివాళులు

**నర్సంపేట, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సా గౌడ్ ఏకైక కుమారుడు సిద్దార్థ బహుజన్ గౌడ్ దశ దిన ఖర్మ కార్యక్రమం నిర్మల్ జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్‌లో వారి స్వగృహంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు గౌడ, ప్రజా సంఘాల నాయకులు కీ.శే.సిద్దార్థ బహుజన్ గౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్య క్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ గాజర్ల అశోక్ గౌడ్, ప్రముఖ న్యాయవాది నలమాస కృష్ణ గౌడ్, మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ కందుల శ్రీనివాస్ గౌడ్,ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోడిగే సదయ్య గౌడ్,చెన్నారావుపేట మండల అధ్యక్షులు గోడిశాల మల్లయ్య గౌడ్,బాల్నే అజయ్ తదితరులు పాల్గొన్నారు.





## ముందస్తు జాగ్రత్తే... ప్రాణ రక్షణకు తొలి అడుగు

### - సీఐ విశ్వేశ్వర్

**గీసుకొండ, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** భారీ నుంచి అతి భారీ వర్షాల నేపథ్యంలో గీసుకొండ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండండి, భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాబోయే రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు ఈదురుగాలులు భారీగా నీటి ప్రవాహాలు ఏర్పడే అవకాశం ఉందని గీసుకొండ సీఐ డి.విశ్వేశ్వర్ ప్రజలకు సూచన చేశారు. ఈ సందర్భంగా సిఐ విశ్వేశ్వర్ మాట్లాడుతూ వర్షం మొదలయ్యాక ఆలోచించడం కాదు. ముందే జాగ్రత్త పడటం మన బాధ్యత.మీ భద్రత కోసం ఈ సూచనలు తప్పక పాటించండి:నీరు నిలిచిన ప్రాంతాలకు వెళ్లవద్దు. లోతట్టు ప్రాంతాలు, నీటితో నిండిన రోడ్లకు దూరంగా ఉండాలని గీసుకొండ సీఐ డి.విశ్వేశ్వర్ కోరారు.

### అత్యవసరమైతే తప్ప ప్రయాణం చేయవద్దు

నీటి ప్రవాహం ఉన్న రోడ్లపై వాహనాలతో వెళ్లే ప్రయత్నం చేయవద్దు.వాగులు, కాలువలు, చెరువులు, జలాశయాల వద్దకు వెళ్లవద్దు, పొంగిపొర్లుతున్న నీటి ప్రవాహాన్ని దాటే ప్రయత్నం చేయకండి. నీటి లోతు తెలియని చోట ఒక్క అడుగు కూడా ముందుకు వేయవద్దు. చెట్లు, విద్యుత్ స్తంభాల కింద నిలబడవద్దు. ఈదురుగాలుల సమయంలో వాటి సమీపంలో ఉండటం ప్రమాదకరం. ఉరుములు, మెరుపుల సమయంలో బయట ఉండవద్దు. వీలైనంత వరకు సురక్షితమైన భవనంలోనే ఉండండి.తెగిపడిన విద్యుత్ తీగలను తాకవద్దు. విద్యుత్ తీగలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండండి.ప్రమాదకర పరిస్థితి కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పంటలు, వ్యవసాయ పరికరాలు, విద్యుత్ మోటార్ల రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టండి.ఇంట్లో అత్యవసర వస్తువులు సిద్ధంగా ఉంచుకోండి. నిర్ధారణ లేని సమాచారాన్ని ఇతరులకు పంపవద్దని సీఐ చెప్పారు.

# నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు

## 17 చెరువుల్లో 30 క్రేన్ల ఏర్పాటు - రూ.2 కోట్లతో ప్రత్యేక ఏర్పాట్లు - అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాల నిర్వహణ



**మట్టెవాడ, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. బుధవారం వరంగల్ జిల్లా పరిధిలోని చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్నతో కలిసి ఆమె వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ బల్దియా పరిధిలోని 17 చెరువుల్లో నిమజ్జనానికి 30 క్రేన్లను ఏర్పాటు చేసి మొత్తం రూ.2 కోట్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జీడబ్ల్యూఎంసీతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, మత్స్య, మైనింగ్ తదితర శాఖలను సమన్వయం చేస్తూ హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, బల్దియా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు. నిమజ్జన కార్యక్రమాల కోసం నగరం మొత్తం శోభాయమానంగా ముస్తాబైందని, గురువారం సాయంత్రం వరకు సుమారు 8 వేల వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు, క్రేన్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో మట్టి విగ్రహాల వినియోగాన్ని మరింత ప్రోత్సహించడం ద్వారా చెరువుల కాలుష్యాన్ని నివారించవచ్చని ప్రజలకు సూచించారు. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీలైనంత త్వరగా గణేష్ విగ్రహాల నిమజ్జనం పూర్తి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ విజ్ఞప్తి చేశారు. నిమజ్జన సమయంలో అధికారులు, పోలీస్ సిబ్బంది సూచనలను పాటిస్తూ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. నిమజ్జనం అనంతరం చెరువుల్లో మిగిలే విగ్రహాల అవశేషాలను తొలగించడం బల్దియాకు కీలక బాధ్యతగా పేర్కొంటూ, వాటిని పూర్తిస్థాయిలో తొలగించి చెరువులను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమాలు పూర్తయిన అనంతరం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించి అవసరమైన చెరువుల్లో పూడికతీత,



శుభ్రత కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. నీటి నిల్వ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుం టున్నామని, నగరవ్యాప్తంగా 145 మంది గజ ఈతగాళ్లతో పాటు డీఆర్ఎఫ్ సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన చెరువుల వద్ద అన్ని శాఖల సమన్వయంతో బల్దియా ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేసిన ట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలు గురువారం వరకు కొనసాగే అవకాశం ఉన్నందున అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకో కుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న మాట్లాడుతూ వినాయక నిమజ్జన కార్యక్రమాలను సురక్షితంగా, సజావుగా నిర్వహించేం దుకు అన్ని శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. నిమజ్జన ఏర్పాట్ల కోసం రూ.2 కోట్లను వెచ్చించి, 17 చెరువుల్లో 30 క్రేన్లతో పాటు పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, లైటింగ్, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర సేవలకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య బృందాలను అందుబాటులో ఉంచి, ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విగ్రహాల నిమజ్జనం పూర్తయిన వెంటనే చెరువుల పరిసరాలను శుభ్రం చేసి, విగ్రహాల అవశేషాలను సకాలంలో తొలగించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు అధికారులకు సహకరించి నిర్దేశించిన నిమజ్జన ప్రాంతాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలని, చెరువుల్లోకి దిగకుండా భద్రతా సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ వెంకన్న కోరారు.



## ఉచిత యూనిఫాం, బెల్టుల పంపిణీ

**చిట్యాల, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** చిట్యాల మండలంలోని జూకల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫాం మరియు బెల్టుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ ఎలగొండ సంధ్య, ఏఏపీసీ చైర్మన్ నిర్మల, జెడ్పీహెచ్ఎస్ చైర్మన్ కావ్య, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు జి.కృష్ణ హాజరై విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం మరియు బెల్టులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.శ్రీలత మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అన్ని వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి బాగా చదువుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డి. శ్రీలతతో పాటు ఉపాధ్యాయులు సునీత, అనిల్ కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీరు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి : కలెక్టర్



**మహబూబాబాద్, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** మహబూబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపల్ వార్డు పరిధిలో ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేయాలని సంబంధిత మిషన్ భగీరథ, ఇంట్రా, గ్రిడ్, స్థానిక సంస్థలను ఆదేశించారు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు (ఎల్నినో) నేపథ్యంలో సాగునీరు, త్రాగునీరు సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్నందున జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లాలో ఉన్నటువంటి ఓహెచ్ఆర్ (1477) ద్వారా , ఇతర వలరుల ద్వారా త్రాగునీరు అందించేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలుపరచాలని, ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, హౌసింగ్ పీడీ పురుషోత్తం, మిషన్ భగీరథ ఈ ఈలు బి.మాణిక్యరావు, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.



## మారెళ్లపాడు లిఫ్ట్‌తో..రైతుల కల సాకారం

### పినపాక నియోజకవర్గ రైతాంగానికి సాగునీటి భరోసా..!

**మణుగూరు, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** పినపాక నియోజకవర్గంలోని అశ్వాపురం మండలంలో రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం విజయవంతంగా జరిగింది. సీతారామ ప్రాజెక్ట్‌లో భాగంగా పూర్తయిన ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కొన్ని వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి ప్రయోజనం కలగనుంది. దీంతో అశ్వాపురం మండలంతో పాటు పినపాక నియోజకవర్గ రైతాంగానికి సాగునీటి భరోసా మరింత బలోపేతం కానుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ఌ పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, కలెక్టర్, సబ్ కలెక్టర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, ఇరిగేషన్ శాఖ అధికారులు సీఈ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఈ మహేశ్వరరావు, ఈఈ తెల్లం వెంకటేశ్వర్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభం పినపాక నియోజకవర్గ రైతాంగానికి ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదురుచూస్తున్న సాగు నీటి కల నేడు సాకారం కావడం ఆనందంగా ఉందని తెలిపారు. సీతారామ ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ లిఫ్ట్ ఇరిగేషన్ అందుబాటులోకి రావడంతో అశ్వాపురం మండలంతో పాటు పినపాక నియోజకవర్గ రైతులకు సాగునీటి భరోసా మరింత బలోపేతం కానుందని పేర్కొన్నారు. మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ అందుబాటులోకి రావడంతో కొన్ని వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి ప్రయోజనం కలగనుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారు తెలిపారు. దీనివల్ల రైతులు సాగు కోసం వర్షాలపై ఆధారపడే పరిస్థితి తగ్గడంతో పాటు సాగు విస్తీర్ణం పెరిగి, పంటల ఉత్పత్తి పెరిగే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. రైతులకు సాగునీటి భరోసా కలగడం ద్వారా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా మరింత ఊతం లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను వ్యవసాయ అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడటంతో పినపాక నియోజకవర్గంలోని రైతులకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా అశ్వాపురం మండలంలోని ఆయకట్టు భూములకు సాగునీటి లభ్యత పెరగడంతో రైతులు మరింత విస్తృతంగా వ్యవసాయం చేసుకునే అవకాశం కలుగుతుందని, రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన సాగునీటి వసతులను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదురుచూస్తున్న సాగునీటి కల సాకారం కావడంతో అశ్వాపురం మండలంతో పాటు పినపాక నియోజకవర్గ రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభంతో రైతుల పొలాలకు నీరు, వ్యవసాయానికి బలం, గ్రామీణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి మరింత ప్రోత్సాహం లభించే పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గ రైతులు, ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉప సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆయుష్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..

**భూపాలపల్లి, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** భారతదేశ ప్రాచీన వైద్య విజ్ఞానమైన ఆయుర్వేదం ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. 11వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా భూపాలపల్లిలోని ఇంటిగ్రేటెడ్ ఆయుష్ 50 పడకల ఆసుపత్రిలో బుధవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయుష్ శాఖ డైరెక్టర్ ఐషా మసరత్ ఖానం, ఐఏఎస్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై ధన్వంతరి భగవాన్‌కు పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలనతో శిబిరాన్ని ప్రారంభించారు. ఆయుర్వేదం కేవలం వ్యాధులకు చికిత్స అందించడమే కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానం, సమతుల్య ఆహారం, దినచర్య, ప్రకృతి ఆధారిత వైద్య విధానాల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు అందుబాటులో ఉన్న ఆయుష్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ వైద్య విభాగాలను పరిశీలించి ప్రజలకు అందుతున్న ఆయుష్ వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఆయుష్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. 289 మందికి వైద్య సేవలు మెగా వైద్య శిబిరానికి మొత్తం 289 మంది హాజరై వైద్య సేవలు పొందారు. మధుమేహం, రక్తపోటు, అధిక బరువు, కీళ్ల సమస్యలు, చర్మ వ్యాధులు, జ్వరం, దగ్గు, జలుబు, అస్తమా, స్త్రీ సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సలహాలతో పాటు ఆయుష్ చికిత్సా విధానాలపై సూచనలు అందించారు.



ఆరోగ్యకరమైన జీవన విధానం, సమతుల్య ఆహారం, యోగా, దైనందిన జీవితంలో ఆయుర్వేద సూత్రాల ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

### ఆయుష్ సేవలను మరింత చేరువ చేస్తాం

ప్రజలకు నాణ్యమైన ఆయుష్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే మెగా వైద్య శిబిరం ప్రధాన ఉద్దేశమని ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ కె. రాఘవేందర్‌రావు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భవిష్యత్తులోనూ వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. 'ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం' అనే సందేశంతో నిర్వహిస్తున్న 11వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, ఆరోగ్య సలహాలు, ఆయుష్ వైద్య విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి శ్రీనివాస్, డిప్యూటీ నోడల్ అధికారులు డాక్టర్ మధుమిత, డాక్టర్ ప్రేమ్‌సాగర్, కన్వీనర్ డాక్టర్ బుసారా, వైద్యులు డాక్టర్ జగదీష్‌కన్నా, డాక్టర్ సాధానందం, డాక్టర్ గీత, డాక్టర్ అజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఫార్మసిస్టులు, యోగా ఇన్‌స్ట్రక్టర్లు, ఆయుష్ సిబ్బంది సేవలందించారు.



# జగ్గయ్యపేటలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

### రసాయనాల వినియోగం తగ్గించి సేంద్రియ సాగు వైపు మళ్లాలని రైతులకు సూచనలు




**రేగొండ, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయం (సేంద్రియ సాగు)పై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించరు.ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహక కార్యక్రమం కింద నిర్వహించిన ఈ శిక్షణలో రైతులు, కృషి సఖులు,గ్రామ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నరు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సారయ్య , షార్ప్ ఎన్జీఓ జిల్లా నోడల్ అధికారి మాణికుమార్, జగ్గయ్యపేట గ్రామ సర్పంచ్ నడిపెల్లి శాంతదేవి –వెంకట్రావు, ,కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ లు ముడుపు రజిత, బండ్ల రజిత వ్యవసాయ విస్తరణ అధికారి దివ్య పాల్గొని రైతులకు వివిధ అంశాలపై మార్గదర్శనం చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వ్యవసాయంలో అధికంగా రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల నేల సారవంతత తగ్గిపోవడం,పంటల నాణ్యత దెబ్బతినడం, రైతుల ఆరోగ్యం పై ప్రతికూల ప్రభావాలు పడుతున్నాయని వివరించారు.ఈ సమస్యలను అధిగమించేందుకు ప్రకృతి వ్యవసాయం ఉత్తమ మార్గమని పేర్కొంటూ, రైతులు రసాయనాల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతులను అనుసరించాలని సూచించారు.శిక్షణలో భాగంగా జీవామృతం, నీమాస్త్రం, అగ్న్యాస్త్రం వంటి సేంద్రియ ద్రావణాల తయారీ విధానాలను సవివరంగా వివరించారు.ఈ పద్ధతులు పంటలను పురుగుల నుండి రక్షించడంతో పాటు నేలలో సూక్ష్మజీవుల పెరుగుదలకు దోహదపడతాయని, దీని ద్వారా పంట దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు.తక్కువ వ్యయంతో ఎక్కువ లాభాలు పొందే విధంగా ప్రకృతి వ్యవసాయం రైతులకు ఉపయుక్తమని స్పష్టం చేశారు.కృషి సఖులకు ప్రత్యేక సూచనలు అందిస్తూ, గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంలో వారు ముఖ్య పాత్ర పోషించాలని అధికారులు సూచించారు. రైతులు పరస్పరం అనుభవాలు పంచుకుంటూ ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా రైతుల్లో ప్రకృతి వ్యవసాయం పై చైతన్యం పెంపొందించడంతో పాటు, భవిష్యత్తులో సేంద్రియ సాగును విస్తృతంగా ప్రోత్సహించేందుకు అధికారులు కట్టుబడి ఉన్నట్లు వెల్లడించారు.కార్యక్రమం విజయవంతంగా సాగడంతో పాల్గొన్న రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

# జూకల్‌లో హడలెత్తిస్తున్న కోతుల బెడద..!

### ప్రజల భద్రతకు ముప్పు

**చిట్యాల, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** జూకల్ గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గ్రామంలోని ఇళ్ల పరిసరాలు వీధులు పాఠశాలలు రహదారుల వెంట గుంపులుగా సంచరిస్తున్న కోతులతో చిన్నారులు వృద్ధులు మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను తీసుకెళ్లడంతో పాటు ఇంటి పైకప్పులు విద్యుత్ తీగలపై సంచరిస్తూ ప్రమాదకర పరిస్థితులు సృష్టిస్తున్నాయి. కోతుల గుంపులు ఒక్కసారిగా ప్రజలపైకి రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు పాఠశాలలకు వెళ్లే సమయంలో కోతుల బెడద మరింత ఇబ్బందికరంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడే వరకు అధికారులు వేచి చూడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. సంబంధిత అటవీశాఖ పంచాయతీ అధికారులు వెంటనే గ్రామంలో పర్యటించి పరిస్థితిని పరిశీలించి కోతులను నియంత్రించేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని జూకల్ గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామంలోని కోతులతో ప్రమాదాలు జరగక ముందే ప్రభుత్వం అధికారులు స్పందించి ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



## అందరి సహకారంతో ఆలయ నిర్మాణం

### - పీపుల్స్ డైరీ వార్తకు స్పందన



**చిట్యాల, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** చిట్యాలలో శ్రీరాముడి ఆలయం నిర్మించాలని కోరుతూ బుధవారం పీపుల్స్ డైరీ తెలుగు దినపత్రికలో ప్రచురితమైన శ్రీరామ..! నీ ఆలయ నిర్మాణం ఎప్పుడు స్వామి...? అనే వార్తకు చిట్యాల గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మీఅంతయ్య స్పందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లక్ష్మిఅంతయ్య మాట్లాడుతూ చిట్యాలలో శ్రీరాముడి గుడి నిర్మాణం చేయడానికి ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సహకారంతో పాటు గ్రామంలోని అన్ని వర్గాల వారితో చర్చించి గ్రామ పెద్దల ప్రజల భక్తుల దాతల సహకారంతో తప్పకుండా ఒక కమిటీ వేసి దాన్ని రిజిస్ట్రేషన్ చేసి గ్రామంలోని అందరి సహకారంతో శ్రీరాముడి గుడి నిర్మాణం చేస్తామని తెలిపారు. గ్రామంలో శ్రీరాముడి గుడి నిర్మాణం కోసం పలుసార్లు అద్భుతమైన వార్త కథనాలు అందిస్తున్న దమ్మున్న పీపుల్స్ డైరీ తెలుగు దిన పత్రికను గ్రామ సర్పంచ్ ప్రజలు భక్తులు అభినందించారు. కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

## తెలుగుదేశం పార్టీకే నా జీవితం అంకితం

### పినపాక టీడీపీ సీనియర్ నేత ధర్మరాజుల శంకర్



**పినపాక, సెప్టెంబర్ 23(పీపుల్స్ డైరీ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్న సీనియర్ నాయకులు ధర్మరాజుల శంకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన జీవితాన్ని పూర్తిగా తెలుగుదేశం పార్టీకే అంకితం చేశానని, చివరి శ్వాస వరకు పార్టీలోనే కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2014 నుండి నేటి వరకు ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా, పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీని వీడలేదని, పార్టీ జెండానే భుజాన మోస్తూ నియోజకవర్గం మొత్తం తిరిగానని గుర్తు చేశారు.

### కార్యకర్తలే నా బలం

తనకు పదవులు ముఖ్యం కాదని, కార్యకర్తలే తన బలమని అన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన ప్రతి కార్యకర్తకు జీవితాంతం రుణపడి ఉంటానని, వారి సంక్షేమం కోసం నిరంతరం పాటుపడతానని తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విజన్, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర స్ఫూర్తితో పినపాక నియోజకవర్గంలో పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. రానున్న రోజుల్లో పినపాక గడ్డపై పసుపు జెండా రెపరెపలాడటం ఖాయమని ధర్మరాజుల శంకర్ ధీమా వ్యక్తం చేశారు.

# విద్యార్థులతో మంత్రి పొన్నం ముఖాముఖి..!

## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు

### హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మిక పర్యటన

### సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి





**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబర్ 23 ((పీపుల్స్ డైరీ) :** హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల, హాస్టల్‌లోని వసతులను పరిశీలించి విద్యార్థులతో నేరుగా ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థులను వేర్వేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు తెలిపిన సమస్యలను మంత్రి స్వయంగా నోట్ చేసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులతో కలిసి ప్రతిరోజూ సిబ్బంది లో ఒకరు భోజనం చేయాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.విద్యార్థులతో కలిసి ఒక కమిటీ ఏర్పాటు చేసి భోజనం, వసతులపై వారి అభిప్రాయాలను తీసుకో వాలని ఆదేశించారు. ఇకపై భోజనానికి సంబంధించి విద్యార్థుల నుంచి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తాను హుస్నాబాద్ వచ్చినప్పుడు విద్యార్థులతో కలిసి భోజనం చేస్తాననీ విద్యార్థుల సమస్యలను నేరుగా తెలుసుకుంటా ననీ ,విద్యార్థులకు ఏ సమస్య ఉన్నా నాకు చెప్పే హక్కు ఉంది. నేను మీ గార్డియన్‌గా ఉంటాను" అని మంత్రి విద్యార్థులతో అన్నారు. బాయ్స్ హాస్టల్‌లో బాత్రూమ్ తదితర సమస్యలను తక్షణ మే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. విద్యార్థులకు అవసర మైన వసతులు, మంచి ఆహారం, రవాణా సదుపాయాలు కల్పించడం తన బాధ్యత అని తెలిపారు. విద్యార్థు లు కోరుతున్న బస్సు, రవాణా సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల డిపాజిట్‌కు సంబంధించిన సమస్య లేదని స్పష్టం చేశారు. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు లైబ్రరీ సమస్యను పరిష్కరించాలని మంత్రి సూచించారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు.విద్యార్థులకు అవసరమైన స్పోర్ట్స్ కిట్లను అందిస్తామని మంత్రి తెలిపారు. సమీపంలోనే స్టేడియం ఉన్నందున విద్యార్థులు క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొనాలని సూచించారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రకాల పోటీలు, ఇతర సహపాఠ్య కార్యక్ర మాలు నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని మంత్రి సూచించారు. డ్రగ్స్, శాంతిభద్రతలపై పోలీసుల ఆధ్వర్యం లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు."గంజాయి, డ్రగ్స్ వంటి దురలవాట్లు మన దగ్గరకు కూడా రానివ్వొద్దు. వ్యక్తిగత క్రమశిక్షణ ఎంతో అవసరం" అని మంత్రి విద్యార్థులకు సూచించారు. కళాశాలలో ప్రతిభ కనబరిచే టాపర్లకు ల్యాప్‌టాప్‌లు అందిస్తామని మంత్రి ప్రకటించారు. సైకిళ్లు లేని విద్యార్థులకు సైకిళ్లు అందించే చర్యలు తీసుకుంటామని తెలిపారు.విద్యార్థులకు క్యాంపస్ సెలెక్షన్స్, ప్లేస్‌మెంట్స్ తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్లతో మోటివేషనల్ క్లాసులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని విద్యార్థులను ఉన్నత విద్య కోసం కళాశాలకు పంపించారని మంత్రి గుర్తు చేశారు."మీ ధ్యాస మొత్తం విద్యపై ఉండాలి. మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి. తల్లిదండ్రులకు, యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలి" అని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మంచి వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. మంచి ఆహారం, అకామిడేషన్, రవాణా కల్పించడం తన బాధ్యత అని, మంచి బోధన, స్టడీ ఫ్యాకల్టీని అందించడం అధ్యాపకుల బాధ్యత అని, మంచిగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడం విద్యార్థుల బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. తాను కూడా విద్యార్థి దశలోనే ప్రజా జీవితంలోకి వచ్చానని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు."1987 లో డిగ్రీ కళాశాల ప్రెసిడెంట్‌గా గెలిచి విద్యార్థి సంఘం నాయకుడిగా నా ప్రస్థానం ప్రారంభమైంది. అక్కడి నుంచి ప్రజా జీవితంలో కొనసాగుతూ ఈ స్థాయికి వచ్చాను. విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు" అని మంత్రి అన్నారు.హుస్నాబాద్‌లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల, హాస్టల్ భవనాలకు ఏడాది కాలంలోనే శంకుస్థాపన చేసుకున్నామని, విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇటీవల జరిగిన సర్వేలను ప్రస్తావిస్తూ, ఉన్నత విద్య అభ్యసించిన కుటుంబాల్లో తదుపరి తరాలు కూడా విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. విద్య ద్వారానే విద్యార్థులు తమ జీవితాల్లో మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో, లక్ష్యంతో చదువుకుని తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్, అధ్యాపకులు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.





## దుర్గపు సుజాత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి



**శంకరపట్నం సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** శంకరపట్నం మండలం లోని తాడికల్ గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు దుర్గపు సుజాత ఇటీవల మృతి చెందడంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ బుధవారం రోజున ఆమె కుటుంబాన్ని పరా మర్శించారు. దుర్గపు సుజాత నివాసానికి వెళ్లిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం దుర్గపు సుజాత ఎనలేని సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన ఆమె సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామ అభివృద్ధికి ఆమె చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. దుర్గపు సుజాత కుమారుడు, కుమార్తె చదువుల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. వారు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, శంకరపట్నం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బండారి తిరుపతి,టీపీసీసీ సభ్యులు మాజి జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, మత్స్య గిరిం ద్ర స్వామి ఆలయ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి, వ్యవసాయ మార్కెట్ వైస్ చెర్మన్ నాంపల్లి తిరుపతి, సింగిల్ విండో చైర్మన్లు గోపగోని బసవయ్య గౌడ్, గాజుల మహేష్ గౌడ్, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై



**కరకగూడెం, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరకగూడెం ఎస్సై పి.వి.ఎన్. రావు సూచించారు. రైతులు, యువకులు, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దన్నారు. చిన్నారులు నీటి గుంటలు, చెరువులు, వాగుల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ వైర్లను తాకవద్దని, వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. అనవసరంగా వాగులు, వంకలు దాటేందుకు ప్రయత్నించవద్దన్నారు. రహదారులపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంటే దాటే ప్రయత్నం చేయకుండా వెంటనే పోలీసు వారికి సమాచారం అందించా లని కోరారు. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించి, అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా సురక్షితంగా ఉండాలని ఎస్సై పి.వి.ఎన్. రావు సూచించారు.

# వైద్యం చేయాలా? డేటా ఎంట్రీ చేయాలా?

## ఓటీపీ ఆధారిత సర్వే విధానాన్ని తక్షణమే ఎత్తివేయాలి : భూక్య శివనాయక్

**సింగరేణి, (కారేపల్లి) సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ):** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లపై అనవసరమైన డేటా ఎంట్రీల భారం మోపడం తగదని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కారేపల్లి--కామేపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి భూక్య శివ నాయక్ అన్నారు. వైద్య సేవలపై దృష్టి పెట్టాల్సిన ఆరోగ్య సిబ్బందిని యాప్‌లు, సర్వేలు, డేటా ఎంట్రీల పేరుతో అదనపు పనిభారానికి గురిచేయడం వల్ల వారి ప్రధాన విధులకు ఆటంకం కలుగుతోందన్నారు.కుష్టు సర్వే వంటి కార్యక్రమాల్లో ప్రతి వ్యక్తి నుంచి ఓటీపీ తీసుకునే విధానం క్షేత్రస్థాయిలో సమస్యలకు దారితీస్తోందని ఆయన పేర్కొన్నారు. సైబర్ మోసాలపై ప్రజల్లో ఆందోళన ఉన్న సమయంలో ఓటీపీ కోసం ఆరోగ్య సిబ్బంది ఇళ్లకు వెళ్లాల్సి రావడంతో గ్రామీణ ప్రజల్లో అనుమానాలు, అభద్రతాభావం ఏర్పడుతోందన్నారు. ప్రజలకు రక్షణగా, ఆరోగ్య సేవలందించే సిబ్బందిపైనే అనుమానాలు కలిగే పరిస్థితి రావడం బాధాకరమని అన్నారు.ఏఎన్ఎంలు,



ఆశా వర్కర్లను కేవలం డేటా ఆపరేటర్లుగా కాకుండా వారి ప్రాథమిక వైద్య సేవలకు ప్రాధాన్యం ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు. మహిళా ఆరోగ్య సిబ్బంది ఆత్మగౌరవాన్ని కాపాడడంతో పాటు, అనవసరమైన డేటా ఎంట్రీల భారాన్ని తొలగించాలని కోరారు. ఓటీపీ ఆధారిత సర్వే విధానాన్ని వెంటనే ఎత్తివేసి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రజలకు వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సుందరగిరి ఊర చెరువులో నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు

### నిమజ్జనానికి కేటాయించిన దారిలోనే వెళ్లాలని ఉత్సవ కమిటీలకు విజ్ఞప్తి

### సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి..

**చిగురుమామిడి, సెప్టెంబర్ 23(పీపుల్స్ డైరీ) :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఊర చెరువులో చేపట్టే విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి గ్రామ పంచాయతీ తరపున అన్ని ముందస్తు భద్రతా చర్యలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమజ్జన వేళ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.గతంలో రోడ్డు నిర్మాణ పనుల కోసం ఊర చెరువులో జెసిబితో మట్టి తీయడం వల్ల లోపల పెద్ద పెద్ద ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డా యని యువతకు గుర్తు చేశారు.భక్తుల ప్రాణాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు,ఆయా గుంత లు ఉన్న ప్రాంతాల చుట్టూ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తాత్కాలికంగా రక్షణ కంచె ఏర్పాటు చేసినట్లు వివరించారు.విగ్రహాల నిమజ్జనం కొరకు ప్రత్యేకంగా ఒక సురక్షితమైన దారిని సిద్ధం చేశామని,ఉత్సవ కమిటీలు, భక్తులు తప్పనిసరిగా ఆ దారి గుండా మాత్రమే వెళ్లి నిమజ్జ



నం పూర్తి చేసుకోవాలని కోరారు.ఉత్సాహంతో ప్రమాదక రమైన చోట్లకు వెళ్లవద్దని హెచ్చరించారు. గ్రామంలోని అన్ని కుల సంఘాల నాయకులు,యువకులు, మహిళలు, గ్రామ ప్రజలు ఎలాంటి అపశృతి లేదా ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. అందరూ సమన్వయంతో,భక్తి శ్రద్ధలతో ఈ నిమజ్జన వేడుకలను విజయవంతం చేయాలని సర్పంచ్,పాలకవర్గం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెడబోయిన రాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి గొల్లేని సంపత్, వార్డు సభ్యుడు వంతడుపుల దిలీప్ కుమార్,నాంపల్లి శిరీష సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ తాళ్లపల్లి సత్యం గౌడ్, గ్రామస్తులు గైనితిరుపతిగౌడ్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వరంగల్ విమానాశ్రయానికి ఛత్రపతి శివాజీ మహారాజ్ పేరు పెట్టాలి

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వన్నాల శివాజీ విజ్ఞప్తి



**హుజురాబాద్ సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** వరంగల్‌లో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి ఛత్రపతి శివాజీ మహారాజ్ పేరు పెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లను హుజురాబాద్ మండల బీఆర్ఎస్ ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు వన్నాల శివాజీ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17వ శతాబ్దంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ మొఘల్, సుల్తాన్ పాలకుల ఆధిపత్యాన్ని ఎదుర్కొని మరాఠా స్వరాజ్యాన్ని స్థాపించారని తెలిపారు. చిన్న జాగీర్దార్ స్థాయి నుంచి ఎదిగి మరాఠా ప్రాంతాలను ఏకం చేసి బలమైన రాజ్యాన్ని నిర్మించారని పేర్కొన్నారు. శివాజీ మహారాజ్ గెరిల్లా యుద్ధతంత్రాన్ని సమర్థవంతంగా వినియోగించడంతో పాటు కోటల నిర్మాణం, రక్షణ వ్యవస్థలకు ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. తీర ప్రాంత రక్షణ అవసరాన్ని గుర్తించి నౌకాదళాన్ని ఏర్పాటు చేసిన తొలి పాలకుల్లో ఆయన ఒకరని పేర్కొన్నారు. సమర్థవంతమైన పాలన కోసం అష్టప్రధాన్ వ్యవస్థను ఏర్పాటు చేసి పరిపాలనను బలోపేతం చేశారని, ప్రజల పట్ల న్యాయం, స్త్రీలకు గౌరవం, మత సహనం వంటి విలువలకు ప్రాధాన్యం ఇచ్చారని వన్నాల శివాజీ తెలిపారు. పరిపాలనలో మరాఠీ, సంస్కృత భాషలకు ప్రాధాన్యం కల్పించారని పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ వరంగల్ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వన్నాల శివాజీ విజ్ఞప్తి చేశారు.

# వినాయక నిమజ్జన ప్రాంతాల్లో భద్రతకు ప్రత్యేక చర్యలు

## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి : అధికారులు



**సింగరేణి,(కారేపల్లి)సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** సింగరేణి మండలంలో వినాయక విగ్రహాల నిమజ్జనం జరగనున్న చెరువులు, నీటి వనరుల వద్ద భద్రతా ఏర్పాట్లను మండల స్థాయి అధికారుల బృందం పరిశీలించింది. తహశీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎంపీడీవో మల్లెల రవీంద్రప్రసాద్, ఎస్ఐ బైరు గోపి తదితరులు నిమజ్జన ప్రాంతాలను సందర్శించి స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు.భారీ వర్షాల కారణంగా చెరువులు, కుంటల్లో నీటిమట్టం పెరిగి లోతు, ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు నీటిలోకి దిగి నిమజ్జనం చేయకూడదని అధికారులు సూచించారు. నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన సురక్షిత ప్రాంతాల నుంచే విగ్రహాలను నిమజ్జనం చేయాలని, లోతైన ప్రాంతాలు, జారుడు ప్రదేశాలు, చెరువు కట్టల అంచులకు వెళ్లకుండా నిర్వాహకులు పర్యవేక్షించాలని తెలిపారు. ఉసిరికాయలపల్లి గ్రామ పంచాయతీలోని, భాగ్యనగర్ తండ సరిహద్దుల్లో నిమజ్జనం జరగనున్న బొడ్రస్ కుంట చెరువును అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ హీరాలాల్, పంచాయతీ కార్యదర్శి పెండ్రా అనిల్ కుమార్, ఆర్ఐ జగదీశ్, ప్రశాంత్, వార్డు సభ్యుడు భూక్య కిషన్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రజల ఉత్సాహం కంటే భద్రతకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు కోరారు.

# నిజం చెరువులో ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం



**ప్రశాంత వాతావరణంలో నిమజ్జన వేడుకలు, గణనాథునికి ఘనంగా వీడ్కోలు**
**ఏర్పాట్ల కోసం జిల్లాస్థాయి ప్రత్యేక అధికారులను మండలాలకు కేటాయించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

**మహబూబాబాద్, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** నిజాం, జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ఉన్న చెరువులో వినాయక నిమజ్జనోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు తీసుకువచ్చిన గణపతి విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేశారు. క్రేన్ సహాయంతో, మున్సిపల్ కమిషనర్ చెరువులో ఏర్పాటు చేసిన నీటితెప్పలపై దిగి విగ్రహాలను స్వయం గా నిమజ్జనం చేయడంతో పాటు.... నిమజ్జన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా... నిజం చెరువు వద్ద గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయడం జరిగింద న్నారు. చెరువుకు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి విగ్రహాలు నిమజ్జనానికి రానున్నాయని పేర్కొన్నారు. దీనితో పాటు జిల్లా పరిధిలో ఉన్న అన్నీ నిమజ్జన పాయింట్ ల వద్ద అధికారులు తగు ఏర్పాట్లు చేసారన్నారు. వినాయక నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు విధులు నిర్వహిస్తున్న పోలీస్, రెవిన్యూ, మున్సిపల్,విద్యుత్, ఇరిగేషన్, మత్స్య శాఖ, ఆర్ అండ్ బి, ఫైర్ తదితర అన్నీ శాఖల అధికారులు నిమగ్న మై ఉన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో ప్రతిష్టించిన గణనాథుల విగ్రహాలను భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు, కోలాటాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా నిజం చెరువు వద్దకు తీసుకురాగా క్రేన్ల సహాయం తో ప్రత్యేకంగా తయారు చేసిన తెప్పల్లో చెరువు నీటిలో నిమజ్జనం చేశారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. నిమజ్జన ప్రాంతంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, తాగునీరు , వైద్య శిబిరాలు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో గణనాథుడి నిమజ్జన వేడుకల ను నిర్వహించుకునేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వ యంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నిజాం చెరువు లో నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్రావు, మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి, స్థానిక కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ వినోద్, తహసిల్దార్ రాజేశ్వరరావు, ఈ సందర్భంగా సిపిఓ శ్రీనివాసరావు కురవి మండలం, జిల్లా పశువైద్య అధికారి చిన్న గూడూరు, నెల్లికుదురు జి.మరియన్న, వివిధ మండలాల లో అన్ని విభాగాల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







# జై జై గణేశా.. బై బై గణేశా..అంటూ నిమజ్జన వేడుకలు



**కరకగూడెం, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని వివిధ గ్రామాల్లో జరుపుకుంటున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు దాదాపు ముగింపు దశకు చేరుకోవడం జరిగింది. భక్తిశ్రద్ధలతో మహిళలు, యువతులు, యువకులు, గ్రామస్తుల సహాయ సహకారాలతో నవరాత్రులను భక్తిశ్రద్ధలతో, నిత్య పూజలతో, రంగురంగుల అలంకరణలతో, విశేష పూజలను గణనాథుడు అందుకోవడం జరిగింది. వేడుకలు తుది ఘట్టానికి చేరుకోవడంతో కరక గూడెం మండల కేంద్రంలోని గణపతి మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని యెల్లు రామకృష్ణ రెడీ -రమాదేవి ఆధ్వర్యంలో, ఉత్సవ కమిటీ నిర్వాహకుల సహకారంతో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.. అనంతరం నవరాత్రి పూజలు అందుకున్న పవిత్రమైన గణనాథుని లడ్డు ప్రసాదాన్ని వేలంపాట నిర్వహించగా.. కరకగూడెం గ్రామానికి చెందిన యెల్లు రామకృష్ణ రెడ్డి- రమాదేవి దంపతులు 6516/ దక్కుంచుకున్నారు. కలశాన్ని ఇదే గ్రామానికి చెందిన ఏలిపేద్ది సత్తయ్య-పూలమ్మదంపతులు సొంతం చేసుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అన్నదానం చేయడం ద్వారా సమాజంలో సేవాభావం, ఐక్యత మరింత పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవిన్యూ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ,ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# జోరు వానలోనూ నిమజ్జనోత్సవాలు

**ఏన్కూరు, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** మండల వ్యాప్తంగా తొమ్మిది రోజులపాటు జరిగిన వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి .చివరి రోజు అయిన బుధవారం సాయంత్రం మేళతాళాలు, యువతి, యువకుల నృత్యాలు ఆనందోత్సాహాలతో వినాయకుడి శోభాయాత్ర నిర్వహిం చి, సమీపంలోని చెరువులు కాలువలలో నిమజ్జనం చేశారు .తొమ్మిది రోజులపాటు పూజలు అభిషేకాలు అందుకున్న గణనాథుడికి భక్తులు వీడ్కోలు పలికారు.



# గణనాథుని నిమజ్జనంలో భారీగా పాల్గొన్న మహిళలు



**నర్సంపేట, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట పట్టణంలో విగ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ కాలనీలో ఘనంగా నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలకు ఘన ముగింపు లభించింది. నవరాత్రి ఉత్సవాల అనంతరం నిర్వహించిన గణనాథుని నిమజ్జన కార్యక్రమంలో తెలంగాణ కాలనీ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారికి వీడ్కోలు పలికారు.మహిళలు సంప్రదాయ దుస్తుల్లో హాజరై భక్తిగీతాలు, భజనలు, నృత్యాలతో నిమజ్జన వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గణపతి బప్పా మోరియా. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా" అంటూ భక్తుల నినాదాలతో నిమజ్జన ఊరేగింపు సందడిగా సాగింది.ఈ సందర్భంగా విగ్నేశ్వర ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయడంలో సహకరించిన తెలంగాణ కాలనీ ప్రజలకు, ముఖ్యంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భక్తుల ఐక్యత, సహకారంతో ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయని పేర్కొన్నారు.

# శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా గణేష్ నిమజ్జన వేడుకలు

**హనుమకొండ(స్నేహనగర్), సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** హనుమకొండలోని స్నేహనగర్‌లో గల శ్రీ చైతన్య పాఠశాల (ఐపీఎల్ బ్రాంచ్) లో గణేష్ నిమజ్జన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటిచెబుతూ, ఈ వేడుకలను పూర్తిగా "ఎకో-ఫ్రెండ్లీ" (పర్యావరణహిత) పద్ధతిలో నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద ఎత్తున, ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది కాషాయ రంగు కుర్తాలు, సాంప్రదాయ వస్త్రాలు ధరించి భక్తిశ్రద్ధలతో మట్టి వినాయక విగ్రహాలను ప్రదర్శించారు. భవిష్యత్ తరాలకు పచ్చని పర్యావరణాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమా న్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలియజేశారు. పాఠశాల ప్రాంగ ణం నుండి ప్రారంభమైన నిమజ్జన శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. అరటి ఆకులతో పచ్చగా, అందంగా అలంకరించిన ప్రత్యేక వాహనాల్లో గణనాథుడిని కొలువుదీర్చి ఊరేగింపు నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, సాంప్రదాయ వాయిద్యాల నడుమ విద్యార్థులు, ఉపాధ్యాయులు శోభాయాత్రలో భక్తితో సందడి చేశారు. మట్టి గణపతినే పూజిద్దాం, పర్యావరణాన్ని రక్షిద్దాం అనే గొప్ప సందేశాన్ని ఈ వేడుకల ద్వారా పాఠశాల యాజమాన్యం విజయవంతంగా అందజేసింది.







# గంగారం, గూడూరు పీహెచ్‌సీల్లో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

**మహబూబాబాద్, సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** మహబూబా బాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ బుధవారం గంగారం, గూడూరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమలు చేస్తున్న వివిధ కేంద్ర మరియు రాష్ట్ర ఆరోగ్య పథకాల రికార్డులను, అలాగే సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధనపై వైద్యాధికారితో సమీక్ష నిర్వహించి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే 0--5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా అవసరమైన మందులు, పరీక్షా కిట్లు తదితర వైద్య సామగ్రిని తగినంతగా అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారికి సూచించారు. జిల్లాలో జరుగుతున్న వినాయక నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాల ఏర్పాట్లను కూడా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పరిశీలించా రు. నిమజ్జన కార్యక్రమాల సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సిబ్బంది, మందులు మరియు ఇతర అత్యవసర వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గంగారం మండలంలోని వైద్యాధికారి డాక్టర్ కిరణ్, గూడూరు మండ లంలోని వైద్యాధికారి డాక్టర్ పవన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com